క్లుప్తంగా

7న మెగా జాబ్ మేళా

తాళ్లపూడి: స్థానిక మండల మానవత సంస్థ ఆధ్వర్యంలో ఏడో తేదీన మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు మానవత అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు, కరిబండి విద్యాసంస్థల డైరెక్టర్ కబండి త్రినాథస్వామి తెలిపారు. తాళ్లపూడిలోని కరిబండి విద్యా సంస్థల యాజమాన్యం సహకారంతో కరిబండి సుబ్బారావు మెమోరియల్ డిగ్రీ కళాశాల వద్ద జరుగుతుందని తెలిపారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్థిక సాయం

తాళ్లపూడి: మండల మానవత స్వచ్ఛంద ఆధ్వర్యంలో రావూరుపాడు గ్రామానికి చెందిన పుప్పాల కాంతమ్మ, గోకవరపు మల్లీశ్వరీలకు రూ.2500 చొప్పున ఆర్థిక సాయం బుధవారం అందజేశారు. కుటుంబ ఖర్చుల నిమిత్తం మానవత అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మానవత సంస్థ ధ్యేయం అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు వి.చంద్రయ్య, సనపల రాజశేఖర్, కొలిశెట్టి నాగేశ్వరరావు, పిల్లి హరీష్, నల్లాకుల గనిరాజు, కె.వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సమతుల్యంతోనే మనుగడ సాధ్యం

నల్లజర్ల: ప్రకృతి సమతుల్యతతోనే మానవ మనుగడ సాధ్యమని నల్లజర్ల సెక్షన్ ఫారెస్ట్ డీఆర్వో చల్లా శ్రీనివాసరావు అన్నారు. మిషన్ లైఫ్(పర్యావరణహిత జీవనం)కార్యక్రమంపై బుధవారం నల్లజర్లలో ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజవనరులను సంరక్షించుకోవాలని లేని పక్షంలో భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కొవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, సుబ్బారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గండి పోశమ్మ హుండీ ఆదాయం రూ.4.85 లక్షలు

కొవ్వూరు: కుమారదేవంలో గండి పోశమ్మ అమ్మవారి దేవస్థానం ఆలయ హుండీని బుధవారం అధికారులు లెక్కించారు. గడచిన రెండున్నర నెలలకు హుండీ ద్వారా రూ.3,19,090 ఆదాయం సమకూరినట్టు ఆలయ కార్యానిర్వాహణాధికారి మీసాల నాగరాజు తెలిపారు. అమ్మవారికి ఒక సంవత్సరం నుంచి సమర్పించిన చీరలు, జాకెట్లు ద్వారా రూ.1.66 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆయన తెలిపారు. మొత్తం రెండు కలిపి రూ.4,85,090 ఆదాయం సమకూరిందన్నారు. తాడేపల్లిగూడెం డివిజన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్‌కుమార్, దేవ్రటస్టు బోర్డు చైర్మన్ గంధం శ్రీనివాస్, ఇతర కమిటీ సభ్యుల పర్యవేక్షణలో హుండీ లెక్కించినట్టు ఈవో నాగరాజు తెలిపారు.

నిడదవోలులో 19.50 క్వింటాళ్ల వరి విత్తనాలు సీజ్

నిడదవోలు రూరల్: విత్తనాల స్టాక్ రిజిస్టర్ సక్రమంగా లేకపోవడంతో నిడదవోలులోని శ్రీ సత్యనారాయణ రైస్, జనరల్ స్టోర్‌లో 19.50 క్వింటాళ్ల వరి విత్తనాలు సీజ్ చేసినట్టు రాజమహేంద్రవరం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ముత్యాలు నాయుడు, తహసీల్దార్ ఎం.గంగరాజు బుధవారం తెలిపారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశాలతో సత్యనారాయణ రైస్, జనరల్ స్టోర్‌లో తనిఖీ నిర్వహించగా విత్తనాల బ్యాగ్స్‌పై డిక్లరేషన్ లేదని, దీంతో రూ.55,250 విలువ చేసే విత్తనాలు సీజ్ చేయడంతో పాటు మరో 106.10 క్వింటాళ్ల విత్తనాలను విక్రయించకుండా నిలుపుదల చేసినట్టు ఆయన చెప్పారు. ఈ దాడుల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, వ్యవసాయాధికారి భార్గవ మహేష్, డీటీ ఎ.సత్యనారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం



రాజంపాలెంలో వలంటీర్లను సత్కరిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

గోపాలపురం: రాజంపాలెం సచివాలయం వద్ద బుధవారం వలంటీర్లను సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వలంటీర్ల పనితీరుతో గ్రామాల్లో ఉన్న సచివాలయాలకు ప్రజాప్రతినిధులకు గుర్తింపు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కురుకూరి నాగేశ్వరరావు, కార్యదర్శి కె.అనురాధ సచివాలయ ఉద్యోగులు వలంటీర్లు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని పోచవరం, మలకపల్లి గ్రామ సచివాలయ పరిధిలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు వలంటీర్లకు శాలువా, పూల మాలతో సత్కరించి, ప్రసంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు కాకర్ల హేమలత, రాపాక రాజేశ్వరీ, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీమాతో పాడిరైతు ధీమా

- పశువులకు ప్రమాద బీమా అందిస్తున్న ప్రభుత్వం
- జూన్ ఒకటి నుంచి వైఎస్సార్ పశు బీమా పథకం ప్రారంభం



కొవ్వూరు: మనుషులకే కాదు పశువులకూ ప్రమాద బీమా అవసరమే.. ఏదైనా ప్రకృతి విపత్తులు, ఇతర ప్రమాదాలు సంభవించిన సమయంలో పశువులు మృతి చెందుతున్నాయి. ఆ సమయంలో పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకం అమలు చేస్తోంది. పాడి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటోంది. నామమాత్రపు ప్రీమియం చెల్లించడం ద్వారా మూడేళ్ల పాటు పశువులకు బీమా కల్పిస్తుంది. ఈ బీమా చేయిస్తే ప్రమాదవశాత్తు పాడి పశువు, గొర్రెలు, మేకలు ఇతర పశువులు చనిపోయినప్పుడు పరిహారం పొందే అవకాశం ఉంటుంది. గతంలో వైఎస్సార్ పశు నష్ట పరిహారం పథకం ఉండేది. దీనిలో పశువు విలువ ఎంత ఉన్నా గరిష్టంగా పాడి పశువుకి రూ.30వేలు, గొర్రె, మేకలకు రూ.6వేలు చొప్పున అందించే వారు. ఒక్కో రైతుకు ఐదు పాడి పశువుల వరకు, గొర్రెలు, మేకలకు ఇరవై వరకు గరిష్టంగా అందించేవారు. ఇప్పుడు ఈ పథకం స్థానంలో వైఎస్సార్ బీమా పథకం తీసుకొచ్చారు. పశువుల విలువను బట్టి బీమా చెల్లిస్తారు.

బీమాలో ప్రభుత్వ వాటా..

బీమా పథకంలో పశువు విలువ ఎంత ఉంటుందో అంతకి బీమా చెల్లించే వెసులుబాటు ఉంటుంది. ఉదాహరణకు పాడి పశువు విలువ రూ.1.50 లక్షలు ఉంటే అంత మొత్తాన్ని బీమా చెల్లించుకోవచ్చు. బీమాకి చెల్లించే ప్రీమియం మొత్తంలో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని మినహాయించి రైతులు మిగిలిన సొమ్ము చెల్లించుకోవాలి. జూన్ ఒకటో తేదీ నుంచి ఈ పథకం ప్రారంభమవుతుంది. ఈ పథకంలో పశువులు, గొర్రెలు, మేకలు చనిపోతే పదిహేను రోజుల్లోనే బీమా మొత్తం పొందే అవకాశం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీలతో పాటు దారిద్ర్యరేఖకు దిగువన(బీపీఎల్) ఉన్న పశుపెంపకదారులు ప్రీమియంలో ఇరవై శాతం వాటా చెల్లించాలి. 40 శాతం చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. దరిద్యరేఖకు ఎగువన ఉన్న వారు 50 శాతం వాటా ప్రీమియం వాటాను లబ్ధిదారుడు, 25 శాతం చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరో 50 శాతం ప్రీమియాన్ని చెల్లిస్తాయి. ప్రతి కుటుంబానికి ఐదు పాడి పశువులు, 50 గొర్రెలు, మేకలు, పందులకు పశు బీమా ద్వారా పరిహారం పొందే అవకాశం ఉంది.

కొవ్వూరు డివిజన్‌లో పశు సంపద వివరాలు

ఆవులు	34,279
గేదెలు	94,672
గొర్రెలు	51,434
మేకలు	36,875
పందులు	972
మొత్తం	2,18,232

లబ్ధిదారుల చెల్లింపు

- ఈ పథకంలో రూ.30వేలు ఖరీదైన గేదె, ఆవుకి మొత్తం ప్రీమియం మూడేళ్లు 6.4శాతం అంటే రూ.1,920గా నిర్ధారించారు. దీనిలో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.384లు, ఏపీఎల్ కేటగిరి వాళ్లు రూ.960 చొప్పున లబ్ధిదారుల వాటాగా చెల్లించాలి.
- రూ.15వేలు ఖరీదు చేసే గేదె, ఆవుకు మూడేళ్లకు 6.4 శాతం అంటే రూ.960లుగా ప్రీమియం నిర్ణయించారు. దీనిలో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.192లు, ఏపీఎల్ రూ.480లుగా చెల్లించాలి.
- రూ.6వేలు విలువైన గొర్రె, మేక, పందులకు మొత్తం సంవత్సరానికి మూడు శాతం చొప్పున రూ.180లు, రెండేళ్లకు రూ.270, మూడేళ్లకు రూ.375లు చొప్పున ప్రీమియం చెల్లించాలి. దీనిలో ఒకటి నుంచి మూడేళ్ల ప్రీమియం కింద ఎస్టీ, ఎస్సీ, బీపీఎల్ లబ్ధిదారుడు రూ.36, రూ.54, రూ.75లు చొప్పున, ఏపీఎల్ వాళ్లు రూ.90, రూ.135, రూ.187.50 చొప్పున లబ్ధిదారుడి వాటా చెల్లించాల్సి ఉంటుంది.



వైఎస్సార్ పశు బీమా పథకం కార్డు

పదిహేను రోజుల్లోనే పరిహారం



వైఎస్సార్ పశు బీమా పథకంలో చేరితే పశువు చనిపోయిన పదిహేను రోజుల్లోనే పరిహారం పొందవచ్చు. జూన్ 1 నుంచి బీమా ప్రీమియం చెల్లించాలి. పశువు విలువ ఎంత ఉంటే అంత విలువకూ బీమా సదుపాయం వర్తించే అవకాశం ఉంటుంది.బీమా ప్రీమియం చెల్లింపులో ప్రభుత్వ సబ్సిడీ పోను మిగిలిన సొమ్ము రైతు, పెంపకందారుడు చెల్లించాలి. పాలిచ్చే పశువుని బట్టి దాని విలువను పశువైద్యాధికారులు నిర్ధారిస్తారు.

–ఎ.వెంకటరెడ్డి, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు, కొవ్వూరు

బీమా చేయాల్సిన విధానం

- అర్హత కలిగిన పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారులు బీమా చెల్లించేందుకు సమీపంలో ఉండే రైతు భరోసా కేంద్రాలు, పశు వైద్యశాలలో గానీ సంప్రదించాలి.
- రైతు, పెంపకందారుడు ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి.
- నామినీ వివరాలు, పేరు, రిలేషన్, నామినీ పుట్టిన తేదీ కరెక్టుగా నింపాలి.
- వైఎస్సార్ పశు బీమా చేసిన ప్రతి పశువుకి చెవి పోగు(ఈయర్ ట్యాగ్) తప్పనిసరి చేయించాలి. ట్యాగ్ లేకపోతే బీమా సదుపాయం పొందే అవకాశం కోల్పోతారు.
- బీమా మూడేళ్లకి చేసిన పశువుకి ట్యాగ్ మిస్ అయితే మళ్లీ వేయించుకోవాలి.
- ప్రతి పశువుకి బీమా చేసి ఆన్‌లైన్ చేయించేందుకు రూ.50లు, మేక, గొర్రె, ఇతర జంతువులకైతే రూ.5 చెల్లించాలి.

జీ 20 గ్లోబర్ సదస్సు

గోపాలపురం: చెరుకుమిల్లి ఎంపీపీ పాఠశాలలో జీ 20 గ్లోబల్ సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కె.రూన్సీ రాణి మాట్లాడుతూ జీ 20 సదస్సులో విద్యార్థులకు సమ్మర్ క్యాంపు, ఎస్ఎంసీ సమావేశం, ఫౌండేషన్ లిట్రసీ అండ్ న్యూమరసీ, కథలు చెప్పడం, రంగోలీ, క్విజ్, పద్య పఠనం, డిబేట్, పెయింటింగ్ వంటి పలు అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.అనంతలక్ష్మి, సీఆర్పీ కొయ్య నాగరాజు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీసీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గోపాలపురం: మహాత్మా జ్యోతిరావుపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల కన్వీనర్ ఎంఎస్ సాయినాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం, రాజమహేంద్రవరం(బాలికలు), అనపర్తి, కొవ్వూరు (బాలురు) పాఠశాలల ప్రవేశాలకు 6 నుంచి 9వ తరగతి వరకూ ఖాళీలు పూర్తి చేయడానికి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన అర్హులైన వెనుకబడిన విద్యార్థులు జూన్ 6వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులకు 8వ తేన ఆయా పాఠశాలల వద్ద పరీక్షలు నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ కన్వీనర్ సాయినాథ్ తెలిపారు. వివరాలకు 94402 65787 నంబరు, కొవ్వూరు 91605 05522, రాజమహేంద్రవరం 96528 18307, అనపర్తి 98496 42721 నంబర్లను సంప్రదించాలన్నారు.

సూపర్ స్టార్ కృష్ణ జయంతి



ప్రకాశరావుపాలెంలో కేక్ కటింగ్ చేస్తున్న గణేశ్వరరావు

నల్లజర్ల: సహసానికి మారు పేరు సూపర్ స్టార్ కృష్ణ అని ఆయన అభిమానులు నినదించారు. ఆయన 80వ జయంతి వేడుకలు నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్ద కరుటూరి లక్ష్మీగణేశ్వరరావు కేక్ కట్ చేశారు. సినీపరిశ్రమ ఉన్నంతకాలం అభిమానులకు ఆయన గుర్తుండిపోతారని గణేశ్వరావు అన్నారు. గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. రూ.65 వేలతో రూపొందించిన కృష్ణ విగ్రహావిష్కరణ కార్యక్రమం త్వరలో ఆయన సోదరుడు శేషగిరిరావు చేతుల మీదుగా జరుగుతుందన్నారు. దూలపల్లి రామచంద్రం, గాలింకి ప్రసాదు, సెటారి ఏసు, నేకూరి రమేష్, జొన్నకూటివీర్రాజు, నేకూరి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ధూమపానానికి దూరంగా ఉందాం

నల్లజర్ల: ధూమపానానికి దూరంగా ఉందాం.. మన ప్రాణాలను మనమే కాపాడుకుందాం అంటూ నల్లజర్లలో వైద్య ఉద్యోగులు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. మండంలోని అన్ని గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేసేలా అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ధూమపానానికి బానిసలై ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్న తరుణంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినంగా నిర్వహిస్తోంది. బుధవారం దూబచర్లలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం అనంతరం డాక్టరు గంగాధరరావు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పొగాకు వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ చంద్రశేఖరరాజు, పబ్లిక్ హెల్త్ నర్స్ ఎస్.రాధాకుమారి, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు అన్నమ్మ, విజయకుమారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నల్లజర్లలో వైద్య ఉద్యోగుల ర్యాలీ

పొగాకు వినియోగంతో అనర్థలే..

కొవ్వూరు: పొగాకు వినియోగం వలన అనేక సమస్యలు తలెత్తుతాయని, దానికి దూరంగా ఉండాలని మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి సూచించారు. పట్టణంలో క్రిస్టియన్ పేటలో అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా కృష్ణబాబు పుట్టిన రోజు వేడుక

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు(కృష్ణబాబు) 70వ పుట్టిన రోజు వేడుకలను దొమ్మేరులోని ఆయన స్వగృహం బుధ వారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కృష్ణబాబుకి పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి ప్రత్యేకంగా కేక్ తీసుకెళ్లి కట్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో కృష్ణబాబు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నా అన్నారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృష్ణబాబుకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



దొమ్మేరులో కేక్‌కట్ చేయిస్తున్న రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత, చిత్రంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. కానూరులో వైఎస్ఆర్ జలకళ పథకంలో రైతు వెలుగంటి సత్యనారాయణ చేను వద్ద వేస్తున్న బోరును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ జలకళ పథకం ద్వారా నియోజకవర్గంలో 200 బోర్లు వేశామని దీనిని రూ.4 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ పథకం రైతులకు వరంలాంటిదన్నారు. జూన్ ఒకటో తేదీన రైతు భరోసా పథకంలో రైతులకు ముందస్తుగా పంట పెట్టుబడి కింద సాయం చేస్తున్నామని దీనిని రైతులందరూ గమనించాలని కోరారు. పెరవలి మండలం కానూరులో రజక పేటలో నిర్మించనున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు వీరమళ్ల సత్యనారాయణ, కొమ్మిశెట్టి రాము, తోట సురేష్, కరుటూరి గోపి, అంబటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఉండ్రాజవరం: వేలివెన్ను గ్రామంలో మామహేశ్వరస్వామి వారి ఆలయంలో ధ్వజస్తంభ పున ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ చైర్మన్ పి.గౌతమ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. వారు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. పున ప్రతిష్ఠించిన ధ్వజస్తంభానికి నమస్కరించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణబ్రహ్మానందం, భక్తులు పాల్గొన్నారు. తాడిపర్రు గ్రామంలో సోమేశ్వరస్వామి వారి ఆలయ పున నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కరుటూరి వెంకటేశ్వర రావు, ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, బి.విశ్వేశ్వరరావు, గారపాటి లచ్చయ్య, అరిగెల శ్రీనివాసు, ఏనుగులపల్లి రాఘవులు, కర్నె మారేసు, పెండ్యాల గోవిందరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కానూరులో వేస్తున్న బోరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు పార్టీ నాయకులు

పట్టణ సీఐగా జగదీశ్వరరావు బాధ్యతల స్వీకరణ

కొవ్వూరు: పట్టణ పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ (సీఐ)గా వైబోగుల జగదీశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ సీఐగా పనిచేసిన ఏఎల్ఎస్ రవికుమార్‌ను వీఆర్ (వెకెన్సీ రిజర్వుడు)కు బదిలీ చేశారు. కాకినాడ ఇంటిలిజెన్స్ సీఐగా విధులు నిర్వహించే జగదీశ్వ రరావును ఇక్కడకు సీఐగా నియమించారు. గతంలో ఆయన ఎస్సైగా నిడదవోలు, పెరవలి, తణుకు రూరల్, ట్రాఫిక్, లక్కవరం పోలీసు స్టేషన్లలో పని చేశారు. 2009 బ్యాచ్‌కి చెందిన నిడదవోలులో పని చేస్తున్న సమయంలో రెండేళ్ల క్రితం సీఐగా పదోన్నతి పొందారు. పట్టణంలో మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనితను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను సిబ్బంది, గ్రామ,వార్డు మహిళ పోలీసులు సీఐని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కొవ్వూరులో హోమ్ మంత్రి తానేటి వనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ వైబోగుల జగదీశ్వరరావు

నీటి సమస్యను పరిష్కరించాలని మహిళల రాస్తారోకో

- మహిళలతో ఎమ్మెల్యే తలారి చర్చలు
- రూ.10 లక్షలతో ట్యాంకు నిర్మాణానికి హామీ
- రెండు గంటలు స్తంభించిన ట్రాఫిక్

దేవరపల్లి: పది రోజులుగా మంచినీటి కోసం అల్లాడుతున్నామని అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ దేవరపల్లి మండలం గౌరీపట్నం శివారు కొండగూడెం ప్రజలు బుధవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. దేవరపల్లి–కొవ్వూరు ప్రధాన రహదారిపై మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. సుమారు రెండు గంటలు ట్రాఫిక్ నిలిచిపోవడంతో దేవరపల్లి సీఐ ఎ.శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకుని మహిళలతో చర్చలు జరిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి సమాధానం చెప్పే వరకూ ఆందోళన కొనసాగిస్తామని మహిళలు తెలిపారు. నల్లజర్లలో గడపగడపకూ కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విషయం తెలుసుకుని హుటాహుటీన కొండగూడెం చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు.

పది రోజులుగా మంచినీరు లేక సుమారు 300 కుటుంబాలు ఇబ్బంది పడుతున్నామని, గ్రామ సర్పంచ్, కార్యదర్శికి చెప్పినా స్పందించలేదని మహిళలు ఎమ్మెల్యే తలారికి వివరించారు. రోజుకు ఐదు ట్యాంకుల నీటి సరఫరా చేస్తున్నారని, దీనిలో ఒక ట్యాంకు నీరు వార్డు మెంబరు పట్టుకుంటున్నాడని, నాలుగు ట్యాంకుల నీరు 300 కుటుంబాలకు ఎలా సరిపోతాయని ప్రజలు వాపోయారు. విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నామని, తమ గోడును పట్టించుకున్న నాధుడులేడని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ సమస్యను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో తక్షణం మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంచినీటి సమస్యను జిల్లా కలెక్టర్ కె. మాధవీలతకు ఎమ్మెల్యే వెంకట్రావు వివరించారు. 10 వేల లీటర్ల వాటర్ ట్యాంకు, మోటారు ఏర్పాటుకు ప్రత్యేక నిధులు రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. దీనితో మహిళలు శాంతించి ఆందోళనను విరమించారు. గ్రామ సచివాలయ కార్యదర్శి అల్లూరి సత్యనారాయణపై మహిళలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పది రోజులుగా మంచినీటి కోసం అల్లాడుతున్నప్పటికి కార్యదర్శి సత్యనారాయణ తనకు సంబంధంలేనట్టు వ్యవహరిస్తున్నారని మహిళలు తెలిపారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

సజ్జలను మర్యాద పూర్వకంగా కలిసిన తోట

తాళ్లపూడి: ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని బుధవారం పెద్దేవం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తోట రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. హోమ్ మంత్రి డాక్టర్ తానేటి వనితతో కలిసి అమరావతి వెళ్లారు. ఇటీవల నియోజకవర్గంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపుల కల్యాణ మండపానికి నిధులు నేటాయించడంపై సజ్జల రామకృష్ణారెడ్డికి, సీఎంకు కృతజ్ఞతలు తెలిపినట్టు రామకృష్ణ తెలిపారు.



అమరావతిలో సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన తోట రామకృష్ణ

వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ ప్రారంభం

కొవ్వూరు: పట్టణంలో బసివిరెడ్డిపేటలో నూతనంగా నిర్మిస్తున్న రాజ్యలక్ష్మి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం పునఃప్రతిష్ఠలో భాగంగా బుధవారం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత పూజా కార్యక్రమాల్లో పాల్గొ న్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు దేవగుప్తాపు లక్ష్మణరావు దంపతుల చేతుల మీదుగా శాస్త్రయుక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జీర్ణోద్ధరణకు చేరిన ఆలయాన్ని పునః నిర్మాణం చేపట్టడంతో హర్షనీయం అన్నారు. గోవింద ధర్మ ప్రచార ఆచార్య సిద్ధాంత పీఠంరిలిజియస్ అండ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టారు. ట్రస్టు చైర్మన్ లక్ష్మణరావు, వైస్ చైర్మన్ ద్వారంపూడి వెంకట రామారెడ్డి, ప్రధాన కార్యదర్శి గొడవర్తి వేణుగోపాల్, సహాయ కార్యదర్శి రావి రామజోగేశ్వర శర్మ, ఆర్గనైజర్ ఉప్పాడ వెంకట సుబ్బారావులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నల్లజర్ల: గ్రామాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఎమ్మెల్యే తలారివెంకట్రావు అన్నారు. నల్లజర్లలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం 6, 7వ వార్డుల్లో బుధవారం సాయంత్రం ఐదో రోజు జరిగింది. గ్రామ సర్పంచ్ పల్లిజ్యోతి, ఉపసర్పంచ్ రాయుడు విజయకుమార్, వైస్ ఎంపీపీ ఆరుగొల్లు మణి, ఎంపీటీసీ మేణ్ణి వెంకటలక్ష్మి ,గ్రామకమిటీ అధ్యక్షుడు కండెపు రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు కిశోర్‌కుమార్, ఏఈ కమల్‌రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అజయ్ బాబు, హౌసింగ్ ఏఈ శివ, వైఎస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, నాయకులు వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, మద్దిపాటి ప్రసాద్, పల్లి సుబ్బారావు, మేణ్ణి యువరాజు, నీరుకొండ జయకృష్ణ, నాగరాజు, లక్ష్మణరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



నల్లజర్లలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు